www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 10 | జనవరి | 2025
పేజీలు 8

## రామనర్సయ్యనగర్‌ను సందర్శించిన సిపిఐ బృందం

-పారిశుధ్య పనులు చేపట్టాలి -సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



2 లో

## నేత్రపర్వంగా
# రాముల వారి తెప్పోత్సవం



- తిలకించి పులకించిన భక్తులు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ పెద్దలు
- పున్నమి కాంతులు వెదజల్లిన గోదావరి తీరం
- ఆకట్టుకున్న బాణసంచా కాల్పులు
- రామ నామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- నేడు ఉత్తర ద్వారదర్శనం



**ప్రజాపక్షం/భద్రాచలం :** పావన గోదావరి తీరంలో గురువారం భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి తెప్పోత్సవ వేడుక కనుల పండువగా సాగింది. నదీ అలలపై పున్నమి వెలుగులు, విద్యుత్ దీపకాంతులు, బాణసంచా కాల్పుల మోతల్లో తెప్పోత్సవం వేడుక నేత్ర పర్వంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా భద్రాచలం ఎంఎల్‌ఏ డా. తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఇందులో భాగంగా అంతరాలయంలో స్వామివారికి పూజలు చేసిన అనంతరం నూతన వస్త్రాలు అలంకరించి వేధఘోష నడుమ ప్రత్యేక పల్లకీలో మంత్రోశ్చరణలు,మేళతాళాలతో గోదావరి తీరానికి తోడుకొచ్చారు. అప్పటికే సిద్ధం చేసి ఉన్న హంస వాహనంలోని ప్రత్యేకవేదికపై సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను ఆశీలను చేసి స్వామివారికి పూజలు చేసి హారతులు పట్టారు. అనంతరం స్వామివారు గోదావరి

మిగతా 2లో..

## ప్రిన్సిపాల్‌ను పట్టించిన పంతులమ్మ

-లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రిన్సిపాల్, అటెండర్
-ఇల్లందు మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏసిబి దాడులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తనకు రావాల్సిన నెలవారీ వేతనాన్ని ఇచ్చేందుకు లంచం అడిగిన ఓ ప్రిన్సిపాల్‌ను అదే కళాశాలలో పనిచేసే పంతులమ్మ పట్టించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఇల్లందు మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏసిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయిని నుంచి లంచం తీసుకుంటుండగా ప్రిన్సిపాల్ కృష్ణ, అటెండర్ రామకృష్ణ లను ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయిని సంధ్యారాణికి జీతం ఇవ్వాలంటే రూ.10వేలు లంచం ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేసి చివరకు రెండు వేల రూపాయలకు ఒప్పుకున్నారు. దీంతో సదరు ఉపాధ్యాయిని ఏసిబి అధికారులను సంప్రదించింది. ఈ నేపథ్యంలో రెండు వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ప్రిన్సిపాల్, అటెండర్‌లు పట్టుబడ్డారు. వారిరువురిని అదుపులోకి తీసుకున్నారు.

## నైపుణ్యత గల
# ఉపాధ్యాయులను తయారు చేయాలి




-తొలి ఏడాది 11వేలకు పైగా ఉపాధ్యాయుల భర్తీ
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
-డైట్ అడ్మినిస్ట్రేటీవ్ భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** డైట్ కళాశాల నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేసి సమాజానికి అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఏడవ డివిజన్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటీవ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ 70 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యను అభివృద్ధి చేయలేకపోయామన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని దీని వల్ల అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని మంత్రి తెలిపారు. జీవితంలో ఏదో ఒక స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఒక ఉపాధ్యాయుడు మార్గం చూపే ఉంటారని మంత్రి

మిగతా 2లో..

# కొణిజర్ల పోలీసులా.. మజాకా..!







-పచ్చని పంట పొలం బీడు పడాల్సిందే..!
-రెండేళ్లుగా ఆ ఎనిమిదెకరాల్లో దుక్కి దున్నని దైన్యం
-అన్నదమ్ముల పంచాయతీతో తడవని నేల తల్లి
-పాతిక పుట్లు పండించే రైతు.. పాతిక కేజీల బియ్యం కొంటున్న దుస్థితి
-కొణిజర్ల పోలీసులు తేల్చరు.. కోర్టుకి రిమాండ్ చేయరు

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** పంచాయతీ ఎలాంటిదైనా పరిష్కరించే క్రమంలో చాకచక్యం ప్రదర్శించడం ఎంతో ముఖ్యం. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చాలా కేసులను ఒక్క రోజులో కొలిక్కి తీసుకొచ్చి శభాష్ అనిపించుకునే పోలీసు అధికారులను చూశాం. అది క్రిమినల్ కేసైనా, సివిల్ కేసైనా సరే. ఇట్టే ఆకళింపు చేసుకుని

మిగతా 2లో..

# నేత్రపర్వంగా రాముల వారి తెప్పోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

తీరంలో హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఐదు సార్లు నదీ తీరంలో స్వామివారు కలియతిరుగుతుండగా అర్చక స్వాములు మంత్రపఠనం చేశారు. గోదావరిలో హంసవాహనం తిరుగుతున్నంత సేపు అవతలి ఒడ్డు ఇసుక తెన్నులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక బాణాసంచా కాల్పులు మిరిమిట్లు గొలిపే కాంతులను వెదజల్లాయి. తారా జువ్వలు ఆకాశాన్ని తాకుతూ స్వామికి శబ్ద కాంతుల నిరాజనాలు పట్టాయి. ఈ అపూర్వ తెప్పోత్సవ వేడుకను కనులారా తిలకించేందుకు గోదావరి తీరానికి ఇసుకేస్తే రాలనంత మంది భక్తులు తరలి వచ్చారు. రాష్ట్రంలో ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ ఉచిత బస్సు సర్వీసులను ప్రభుత్వ పథకంలో భాగంగా నడుపుతుండటంతో రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారి తెప్పోత్సవ వేడుకను కనులారా చూసిన భక్తులు పులకించారు. పున్నమి వెన్నెల కాంతుల్లో స్వామివారి దర్శనం కావడంతో భక్తులు పెద్ద పెట్టున జై శ్రీరాం అంటూ చేసిన నినాదాలతో భద్రగిరి మార్మోగింది. నదీతీరంలో వివిఐపి, విఐపిలతో పాటు తదితర గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి మిత్రా నేతృత్వంలో ఎస్‌పి ఆధ్వర్యంలో గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించారు. గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన వివిధ ఇళ్లతో పాటు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చేసిన ఏర్పాట్లు భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. గిరిజన సాంప్రదాయ వంటకాలు, ఆహార పదార్థాలు భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ



నాయక్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్‌డి దామోదర్ రావు, దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, తహశీల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఉత్తర ద్వార దర్శనం...**

శ్రీ సీతారామ చంద్ర స్వామివారు నేడు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందు కోసం అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిఐపి, విఐపి బారికేడ్లు ఏర్పాటు చేశారు. సామాన్య భక్తులు ఉత్తర ద్వారా వేడుకను చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం భక్తులు తెల్లవారుఝామునే ఉత్తర ద్వారానికి చేరుకోనున్నారు. జయజయ ధ్వనాల నడుమ, ధూపదీప కాంతులతో రామచంద్ర ప్రభుత్వ ఉత్తర ద్వారం నుండి శుక్రవారం భక్తులకు దర్శనస్తారు.

# నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేయాలి



(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మనం ప్రస్తుతం మంత్రులుగా, ఉన్నతాధికారులుగా ఉండటానికి మన గురువులు మూలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప ఉపాధ్యాయులుగా తయారు కావాలని మంత్రి ఆకాంక్షించారు. నైపుణ్యత ఉన్న ఉపాధ్యాయుల కొరత ఉండడం వల్ల విద్యా ప్రాముఖ్యత ప్రమాణాలు తగ్గుతున్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో పిల్లలకు పూర్తి పరిజ్ఞానంతో సంపూర్ణ విద్యను అందించేలా డైట్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు బయటకు రావాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి ఏడాది ఖాళీ అవుతున్న ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామన్నారు. డైట్ కళాశాల ఆవరణ గ్రీనరీతో పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేవిధంగా తయారు చేయాలన్నారు. డైట్ కళాశాలలో ఎటువంటి మొక్కలు నాటాలో ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థుల సహకారంతో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల శ్రేయస్సు కోరకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రస్తుత యువతలో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారయ్యారని ఆమె తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని ప్రోత్సహించాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన అవసరం ఉంటుందని ఇందులో భాగంగా డైట్ కళాశాల పరిపాలన భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా మంచి పరిణామమన్నారు. ఖమ్మం డైట్ కళాశాల వద్ద ఏర్పాటు చేసే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో అనేక వసతులు ఉంటాయని వీటిని ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు. డైట్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఇక్కడ మౌలిక వసతులను వీలైనంత త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ, డిఈవో సోమశేఖర శర్మ, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పొరేటర్లు దొంగల సత్యనారాయణ, లకావత్ సైదులు, కమర్తపు మురళి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రామనర్సయ్యనగర్‌ను సందర్శించిన సిపిఐ బృందం



**ప్రజాపక్షం/కొణిజర్ల** : మండల పరిధిలోని రామనర్సయ్యనగర్‌లో సిపిఐ బృందం పర్యటించింది. గ్రామంలో వయసుతో సంబంధంలేకుండా జబ్బులు వస్తున్న విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. గ్రామం మొత్తం కలియతిరిగి ఏఏ రకాల జబ్బులతో ప్రజలు బాధపడుతున్నారనే విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా కిడ్నీసమస్యలు, బిపి, షుగర్‌తోపాటు మోకాళ్ల నొప్పులు వస్తున్న విషయాన్ని గమనించారు. వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ మాట్లాడి గ్రామంలో ఇలాంటి జబ్బులు ఎందుకు వస్తున్నాయనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. తాగునీరును కూడా పరీక్షలు చేయించాలని అన్నారు. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతు గ్రామంలో పారిశుద్య లోపం ఉన్నదని, అధికారులు పారిశుద్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. తాగునీటిని శాంపుల్స్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు



చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. డ్రయినేజీ వ్యవస్థలేకపోవడంతో పారిశుద్యం లోపం బాగా ఉని అన్నారు. ఆయా వ్యాధులకు సంబంధించి నిపుణలచే వైద్యపరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. వ్యాధులు నియంత్రణ జరిగేవరకు పూర్తిస్థాయిలో వైద్యశిబిరాన్ని నిర్వహించాలని అన్నారు. గ్రామంలో పల్లె దవఖానా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి యర్రా బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, గ్రామ మాజీ సర్పంచ్ కంపసాటి వెంకన్న, గిరిజన సంఘం నాయకులు గుగులోత్ శ్రీను, ఆంగోత్ మంగీలాల్, సిపిఐ మండల నాయకులు మునిగె కోటేశ్వరరావు, గడల శ్రీనువాసరావు, అజ్మీర బాలాజీ, లకావత్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సదాశివుని పాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో గల నారాయణ పురం, తుంబూరు, సదాశివునిపాలెం, సిద్దారం, తుంబూరు వ్యవసాయ పరిధిలో ఉదయం 9.00 నుండి 11.00 వరకు విద్యుత్ కు అంతరాయం కలుగునని సత్తుపల్లి టౌన్ ఏఈ శరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# కొణిజర్ల పోలీసులా.. మజాకా..!

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించే పోలీసు అధికారులను ప్రజలు కూడా నాలుగు కాలాల పాటు మదిలో నిలుపుకుంటారు. అయితే ఇప్పుడు అలాంటి చాకచక్యం చాలా తక్కువ మంది పోలీసు అధికారులకే ఉందనడంలో అతిశయోక్తి లేదు. .జిల్లా పోలీస్ బాస్ కేసుల పరిష్కారంలో ముందువరుసలో ఉండి శభాష్ అనిపించుకుంటే ఉంటే కొందరు పోలీస్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అందుకు ఓ చక్కని ఉదాహరణే కొణిజర్ల మండలం తనికెళ్ల రెవెన్యూ పరిధిలోని భూ వివాదం. పోలీసుల పుణ్యమాని ఏటా పచ్చగా వర్ధిల్లే ఎనిమిది ఎకరాల పంట భూమి ఇప్పుడు బీడు వారింది. ఆ భూమిలో పాతిక పుట్లు పండించే రైతుకి నేడు తిండి కోసం పాతిక కేజీల బియ్యం కొనుక్కునే దయనీయ స్థితి దాపురించింది. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామం. ఆ గ్రామంలో ఐదుగురు అన్నాదమ్ములున్నారు. ఇరవై ఏళ్ల కిందటే వీరి తల్లిదండ్రులు అనారోగ్య కారణాల చేత మరణించారు. ఈ ఐదుగురు ఒకరిపై ఒకరు పచ్చ గడ్డి వేస్తే భగ్గున మండేంత కక్ష్యలు పెంచుకున్నారు. కాగా తండ్రి పదమూడున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సంపాదించగా ఆ భూమిని పంచుకునే విషయంలో వీరి మధ్య పగలు, ప్రతీకారాలు మరింత పెరిగాయి. అయితే ఆ మొత్తం భూమికి సంబంధించిన పాస్ పుస్తకం ఈ ఐదుగురు అన్నదమ్ముల్లో ఒకరి వద్ద ఉంది. దీంతో ఆ భూమిపై అధికారికంగా ఎవరికి వారు హక్కులు సాధించుకునేందుకు నానా తంటాలు పడ్డారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఎవరికి తోచిన రీతిలో వారు, వారికి ఇష్టం వచ్చినంత భూమిని రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. దీంతో వీరి మధ్య భూ వివాదం ముదిరి పాకాన పడింది. ఈ అయిగురు అన్నదమ్ముల్లో నలుగురు ఒకే తాటిపై ఉన్నారు. ఫలితంగా ఆ ఐదో వ్యక్తి ఈ నలుగురికి టార్గెట్‌గా మారాడు. అతను స్వశక్తితో శ్రమించి ఆర్థికంగా బలపడటంతో జీర్ణించుకోలేకపోయిన 'ఆ నలుగురు' తమ సోదరుడిని లక్ష్యంగా మార్చుకుని ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టారు. ఈ భూమి వ్యవహారాన్నే అస్త్రంగా మార్చుకుని తండ్రి నుంచి వారసత్వంగా పొందిన భూమితో పాటు అతను స్వశక్తితో కొనుగోలు చేసిన భూమిని సైతం దున్నకుండా అడ్డుపడుతున్నారు. ఆ నలుగురు మాత్రం వారి భూమిలో పంట పండించుకుంటూనే ఉండటం గమనార్హం.

**రెండేళ్లుగా బీడు వారిన భూమి...**

నలుగురు అన్నాదమ్ములు తమ సోదరుడిని నానా అగచాట్లకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తండ్రి వారసత్వ భూమిని, అతని సొంత భూమిని సైతం బీడు వారేలా చేశారు. ఫలితంగా ప్రతి ఏటా పాతిక పుట్లు వరి పంట పండే ఆ భూమిలో గడిచిన రెండేళ్లుగా గడ్డి మాత్రమే మొలుస్తోంది. నిత్యం నీటి చెమ్మతో అలరారే ఆ నేల తల్లి ఇప్పుడు నీటి చెమ్మ తగలక నెర్రెలబెట్టింది. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి దాపురించింది. కాగా ఏటా పాతిక పుట్లు పంట పండించి అన్నదాతగా వర్ధిల్లిన ఆ రైతు ఇప్పుడు తిండి గింజలకు వెతుక్కునే దుస్థితి దాపురించింది. ప్రతి నెలా పాతిక కేజీల బియ్యం బస్తా కొనుక్కుని కాలం వెళ్లదీసుకునే దయనీయ స్థితిలోకి ఆ రైతు చేరుకున్నాడు.

**పొలం దున్నితే చంపేస్తారట...**

గతేడాది ఆగస్టు నెలలో ఆ రైతు తన భూమిని దున్నేందుకు ధైర్యం చేశాడు. ట్రాక్టర్‌తో పొలంలోకి వెళ్లగానే సమాచారం అందుకున్న ఆ సోదరులు తమ కుటుంబ సభ్యులతో అక్కడికి చేరుకుని అతనిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. పొలంలోకి అడుగు పెడితే చంపేస్తామంటూ బెదిరించారు. కర్ర మొన కూడా నేలపై మోపడానికి వీల్లేదంటూ భీకరంగా అతడిని ఎదిరించారు. దీంతో భయాందోళనకు గురైన ఆ రైతు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అంతటితో ఆగని ఆ నలుగురు సోదరులు గ్రామంలో టమకా వేయించి మరీ ఊళ్లో ఈ విషయాన్ని ప్రచారం చేశారు. తమ సోదరుడికి చెందిన భూమిని ఎవరూ కౌలుకి కూడా తీసుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. దీంతో చేసేదేమీ లేక ఆ రైతు కొణిజర్ల పోలీసులను ఆశ్రయించి లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు.

**చావకుండా, బతకకుండా...**

తన భూమిని దున్నకుండా అడ్డు పడుతున్న సోదరులపై ఆయన పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డాడు. అతని ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఎఫ్ఐఆర్ అయితే నమోదు చేశారు కానీ ఈ భూ వివాదానికి శాశ్వత పరిష్కారం మాత్రం చూపలేకపోయారు. బాధితుడిని ఇబ్బంది పెడుతున్న ఆ నలుగురు సోదరులను కనీసం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించిన పాపాన పోలేదు. అతని పేరిట ఉన్న భూమిని దున్నుకునేందుకు వెసులుబాటు కల్పించే ఎలాంటి చర్యలకు పూనుకోలేదు. పైగా కొనుక్కున్న సొంత భూమిలోనూ పంట వేయకుండా దౌర్జన్యం చేస్తున్న సోదరులపై కనీస చర్యలు తీసుకోలేదు. ఒక ఎస్సై స్థాయి అధికారి నిజంగా తలచుకుంటే ఒక్క రోజులో పరిష్కారం దొరికే ఈ భూ వివాదాన్ని పడకేయించారే తప్ప కనీసం మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించలేదు. పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం చూపకపోగా ఛార్జ్‌షీట్ వేసి ఈ సమస్యను కనీసం కోర్టు మెట్లెక్కించే ప్రయత్నం కూడా చేయకపోవడమే శోచనీయం. ఇలాంటి సున్నిత కేసుల్లో ప్రత్యేక చొరవ తీసుకుని సత్వర పరిష్కారం చూపని పక్షంలో భూ భకాసురులు పెచ్చరిల్లిపోయే ప్రమాదం ఉంది. దున్నేవాడిదే భూమి అనే నానుడికి బదులు దౌర్జన్యం చేసే వాడిదే భూమి అనే కొత్త నానుడిని చదువుకోవాల్సి వస్తుంది.

# ఆక్యుపంక్చర్, కేరళ క్లినిక్‌లు సీజ్

**-అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు**
**-డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హత లేకుండా ప్రజలకు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. జిల్లాలో ఆక్యుపంక్చర్ వైద్యం, కేరళ వైద్యం, హెర్బల్ క్లినిక్ అని అర్హత లేని వారు వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని ట్రంకు రోడ్డు నందు గల ఆక్యుపంక్చర్ క్లినిక్‌ను డిఎంఅండ్‌హెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వైద్యులుగా పనిచేస్తున్న వై. నరేష్‌కుమార్‌కు ఎటువంటి అర్హత లేదని ఎక్కడ రిజిస్ట్రేషన్ చేయలేదని వైద్యం చేసేందుకు ఎటువంటి సర్టిఫికెట్ లేదని డిఎంఅండ్‌హెచ్‌వో తనిఖీల్లో గుర్తించారు. అక్కడకు వచ్చిన రోగులతో డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడారు. ఇక్కడకు ఎందుకు వచ్చారని రోగులను డిఎంఅండ్‌హెచ్‌వో అడుగగా నరాలు నొక్కి చికిత్స చేస్తారని చెబితే వచ్చామని వారు తెలిపారు. కామేపల్లి మండలం పాతలింగాలకు చెందిన మద్ది శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ వైద్యంతో మృతి చెందాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరేష్‌కుమార్ తమిళనాడు రాష్ట్రంలో పుట్టి తెలంగాణలోని అనేక జిల్లాల్లో ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేసి క్లినిక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా ఎన్‌టిఆర్ సర్కిల్‌లో కేరళ వైద్యం పేరిట ఉన్న క్లినిక్‌ను డిఎంఅండ్‌హెచ్‌వో తనిఖీ చేశారు. అర్హత లేకుండా వైద్యం అందిస్తున్నట్లు గ్రహించి దానిని సీజ్ చేశారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌వో జిల్లా ఆసుపత్రి నందు గల ఎన్‌సిడి క్లినిక్‌ను సందర్శించి అసంక్రమణ వ్యాధుల చికిత్సల గురించి ఆరా తీశారు. చికిత్సల కోసం వచ్చే వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, చికిత్సలు అందించాలని ఆమె తెలిపారు. మందుల స్టోర్, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను పరిశీలించి ఈ ఔషధిలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి సరిపడ మందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పివోలు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ రామారావు, డెమో సాంబశివరెడ్డి, ఎన్‌హెచ్‌ఎం డిపివో దుర్గ, ఎన్‌సిడి కో ఆర్డినేటర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్య, జిల్లా యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ యాదవులకు జనాభా ప్రాతిపదికన రాజకీయంగా నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. మనమంతా ఐక్యతతో ప్రభుత్వాలకు, పార్టీలకు మన సత్తా చూపాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా తెలంగాణ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుబాకుల శ్రీనివాస్, చేతుల నాగేశ్వరరావు, బొల్లి కొమరయ్య, కనకబండి విజయలక్ష్మి, తోడేటి లింగరాజు, మేకల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, గణేష్, పంకు మురళి, రాగం కోటేష్, తుప్పతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొండం కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడులో గ్రామంలోని కల్లుగీత కార్మిక భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఖమ్మం జిల్లా కల్లుగీత కార్మిక కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రముఖ డాక్టర్ నారోగాని రాంప్రసాద్‌గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చిన వెంటనే కల్లుగీత కార్మికులు హామీలు అమలు చేస్తామని చెప్పి నేటివరకు చేయకపోవడం సరికాదన్నారు. సుమారు 5లక్షల మంది కల్లుగీత వృత్తి కొనసాగిస్తూ పలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వారికి సేఫ్టీతో కూడిన పరికరాలను అందించాలని, న్యాయమైన హక్కులను ప్రోత్సహిస్తూ పదివేల కోట్లు కేటాయించాలన్నారు. డాక్టర్ నారగోని రాంప్రసాద్ మాట్లాడుతూ...కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తనవంతుగా కల్లుగీత కార్మికులకు వైద్య సహాయం అవసరమైనప్పుడల్లా తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. గౌడ కులస్తులు గౌరవంతో సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు తాళ్లపల్లి ఉపేందర్, గుండు రమేష్, గుండు శ్రీను, సంపేట శ్రీను, కొండం ఆంజనేయులు, సంపేట సత్యం, కొండం కృష్ణయ్య, గడ్డమీద వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, బోనెపల్లి సంగయ్య, బూరుగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీలో పలువురు నాయి బ్రాహ్మణ నాయకులు చేరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న ఆధ్వర్యంలో పలువురు నాయి బ్రాహ్మణ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, నగర కార్యనిర్వహక అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరి లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు. దుబ్బాకుల వెంకటప్పయ్యను నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామయ్యకు మంత్రి తుమ్మల నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నీటిపారుదల శాఖ విశ్రాంత పర్యవేక్షక ఇంజనీర్ తక్కెళ్లపల్లి సీతారామయ్య మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం నెహ్రూ నగర్‌లోని వారి స్వగృహంలో ఉంచిన సీతారామయ్య భౌతికాయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. నివాళులర్పించిన వారిలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## రామనర్సయ్యనగర్‌లో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని రామనర్సయ్యనగర్‌లో వైద్యశిబిరం రెండోరోజు నిర్వహించారు. గ్రామంల్లో పెద్ద ఎత్తున వైద్యవిబిరానికి హాజరయ్యారు. ఈ శిబిరంలో ఎక్కువగా బిపికి సంబందించి, చక్కరవ్యాధికి సంబందించిన పేషెంట్లే వచ్చారు. బిపికి సంబందించి 80 మంది చక్కరవ్యాధికి సంబందించి 80 మంది పాల్గొన్నారు. వైద్యులు 35 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువమంది బిపి, షుగర్ వ్యాధితో పాటు మోకాళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని ప్రభుత్వం అందరికి వైద్యంచేసి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

## థియేటర్ పరిసరాల్లో పోలీసుల ఆంక్షలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం:** హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సంధ్యథియోటర్ ఘటనను దృష్టిలో ఉంచుకుని ఖమ్మం పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. రమచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా శుక్రవారం విడుదల అవుతున్న నేపధ్యంలో ప్రభుత్వం ఉదయం 4 గంటలకు ప్రత్యేక షోకు అనుమతి ఇచ్చింది. దీంతో థియోటర్ల వద్ద అభిమానుల తోపులాటకు ఆస్కరం లేకుండా ముందస్తుగా పోలీసులు ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించి టౌన్ ఏసిపి రమణమూర్తి అభిమానులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. అన్‌లైన్ టికెట్టు ఉన్న వారు తప్ప ఇతరులకు థియోటర్ల పరిసరాల్లోకి అనుమతి లేదన్నారు. అదేవిధంగా థియోటర్ల వద్ద బాణాసంచా కల్చాడం, కేరింతలు కొట్టడం నిషేదమన్నారు. శాంతియుతంగా ప్రశాత వాతావరణంలో సినిను తిలకించేందుకు ప్రజలు, అభిమానులు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇసుక, చెత్త వేసిన వారికి జరిమానాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్లపై ఇసుక, చెత్త వేసిన వారికి ఖమ్మం కార్పోరేషన్ అధికారులు గురువారం జరిమానాలు విధించారు. కార్పోరేషన్ పరిధిలోని 12వ డివిజన్ గొల్లగూడెం రోడ్డు నందు ఓ భవన నిర్మాణదారుడు రోడ్డుపై ఇసుక పోయడంతో వాహనదారులకు ఇబ్బంది కలగడంతో పాటు కొంత మంది జారీపడుతున్నారు. సమాచారం అందుకున్న కార్పోరేషన్ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి భవన యజమానికి రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. అదేవిధంగా 43వ డివిజన్ నెహ్రూ నగర్ హెచ్‌పి గ్యాస్ గోడౌన్ వద్ద ఓపెన్ ప్లాట్‌లో చెత్తను డంప్ చేసినందుకు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు రెండు వేల రూపాయల జరిమానా విధించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని ఆత్కూరు గ్రామానికి చెందిన పి.ప్రమీలకు స్థానిక శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నందు గురువారం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హాస్పటల్స్‌లో చికిత్స పొంది ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోసం సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకునే వారందరికీ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, యువజన కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవికుమార్, షేక్.జహంగీర్, నిడమనూరి వంశీకృష్ణ,అల్లాడి గోపాలరావు, బండారి నర్సింహారావు, ఆదిమూలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫాతిమా షేక్ జయంతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలో ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెపిఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు మాట్లాడుతూ తాడిత పీడిత అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే అడుగుజాడలలో నడిచిన మహానీయురాలు ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా ఆ మహనీయురాలికి ఘనంగా నివాళులు అర్పించామని, సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలే సహోద్యోగిగా అసమానతలపై పోరాడిన ధీశాలి ఫాతిమా షేక్ ఆధునిక భారతంలో తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని స్మరించుకోవడం జరిగింది తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల నాగరాజు , కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకులు షేక్ సమీర్, బిఎస్పీ పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు, షేక్ సయ్యద్ , శంకర్, వెంకట్, కళ్ళం కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## సున్నం సత్యవతికి నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్న సున్నం రామకృష్ణ చారి సతీమణి సత్యవతి అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మండల ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లంకి చిన్న నాగేశ్వరావు, నర్వనేని పుల్లారావు, ఉద్యమకారుడు వేల్పుల నర్సింహారావు, కోడెం జోగారావు, పురస్తాపురం శ్రీను, దాసరి నాగయ్య, గ్రామస్తులు, పెద్దలు తదితరులు సత్యవతి పార్థీవదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

## ఘనంగా కందాళ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కూసుమంచి :** పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మం డల పార్టీ ఆధ్వర్యంలో గురువా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూసుమంచి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో అధ్యక్ష, కార్యదర్శి వేముల వీరయ్య, మహ్మద్ ఆసిఫ్ ఫాషా, ఇంటూరి శేఖర్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అనంతరం మండలంలోని గోరీలపాడు తండా, లింగారం తండా పలు గ్రామాల్లో కందాళ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, ఇంటూరి శేఖర్, బజ్జురీ రామిరెడ్డి, బానోత్ కిషన్ నాయక్, బాలకృష్ణ రాయబారపు రమేష్, నాయకులు, నలగాటి నాగయ్య, అర్వపల్లి ఉపేందర్, పడిశాల గోపి, నూకల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ పాఠశాల ఏర్పాట్లను పరిశీలించిన డిఈఓ



**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరు చేసిన నవోదయ పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం నుండి ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వరాచారి గురువారం పరిశీలించారు. డిఇఓ వెంకటేశ్వరాచారి, ఏఎంఓ నాగరాజశేఖర్ కరకగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నవోదయ పాఠశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే అవసరమైన సదుపాయాల కల్పన కోసం తీసుకొవాల్సిన చర్యలను వారు అంచనా వేశారు. జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ మంజులను పాఠశాల భవనాలు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం జూన్ నాటికి నవోదయ పాఠశాలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాల జారీ అయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ప్రాంగణంలో గల భవనాలను, గదులను పరిశీలించారు. ఇప్పటివరకు ప్రాంగణంలో గల భవనాల్లో కేజిబివి పాఠశాల కొనసాగేదని, వాచ్ఎం మంజుల తెలిపారు. ఎంఆర్సి భవనాన్ని, పాత కేజిబివి భవనాలను పరిశీలించి ఉన్నత పాఠశాల తరగతులను మరమ్మత్తులు చేయించి ఈ భవనాల్లో కొనసాగిస్తే నూతన నవోదయ పాఠశాల ప్రారంభానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు డిఇఓ తెలిపారు. పాత కేజిబివి, ఎంఆర్సి భవనాలు మరమ్మత్తులు అవసరం కాగా అవసరమైన ఇంజనీరింగ్ అధికారుల ప్రతిపాదనల మేరకు నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డిఇఓ తెలిపారు.

# సిపిఐ ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధం

**- సంక్రాంతిని పురస్కరించుకొని ఏర్పాట్లు పూర్తి చేసిన శాఖలు**
**- గత 29 సంవత్సరాల క్రితం బీజం వేసిన అమరజీవి దండి భాస్కర్**





(ఫైల్)

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం వరంగల్‌క్రాస్ రోడ్డులోని మారుతీనగర్, ఏదులాపురం గ్రామంలో అక్కడి సిపిఐ గ్రామశాఖ, దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, ఏఐవైఎఫ్(అఖిలభారత యువజన సమాఖ్య), మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధమయ్యింది. ముగ్గుల పోటీలు విజయవంతం చేయడమే లక్ష్యంగా ఆ శాఖలలోని ముఖ్య కార్యకర్తలతో ఇప్పటికే సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ దిశానిర్దేశం చేశారు. వందలాదిగా తరలిరానున్న మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను సైతం అక్కడి సిపిఐ శాఖలు పూర్తి చేశాయి. దీంతో ఆ ప్రాంతాలంతా రంగురంగుల రంగవల్లులతో వెల్లువిరవనున్న హరివిల్లుల కోసం ఎదురుచూస్తుంది.

**అమరజీవి దండి భాస్కర్ చొరవతో ఏర్పాటు...**

సిపిఐ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ కామ్రేడ్ దండి భాస్కర్ చొరవతో గత 29సంవత్సరాల క్రితం సంక్రాంతి ముగ్గుల పోటీలకు బీజం పడింది. మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన పోటీలు నాటి నుంచి దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. ముగ్గుల పోటీల సమయంలో దండి భాస్కర్ క్యాన్సర్ భారిన పడి అనారోగ్యానికి గురైనప్పటికీ పాల్గొని విజయవంతం చేసిన తీరు ఇప్పటికి ఇక్కడి ప్రజల్లో సుస్థిరంగా నిలిచింది. తన గుండెల నిండా..నింపుకున్న సిపిఐ పార్టీని, భాస్కర్ అన్నా అని ఆప్యాయంగా పిలిచే ప్రజలను విడిచిపోతున్నాననే భావోద్వేగానికి గురైన క్షణం కన్నీటి జ్ఞాపకంగా మిగిలిపోయింది. తమ్ముడు తలపెట్టిన పోటీలను అన్నయ్యగా కామ్రేడ్ దండి సురేష్ ఆ ఒరవడిని కొనసాగిస్తున్నారు. ఇందుకు ఇక్కడి పార్టీ శ్రేణులు సైతం ముందుండి ముగ్గుల పోటీలను విజయవంతం చేస్తున్నారు. పోటీల కోసం అక్కడి సిసిరోడ్డుపై డబ్బాలను గీసి ముగ్గులు వేసేందుకు వీలును కల్పించడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. అలాగే ఏదులాపురం గ్రామంలో రాత్రిపూట పోటీలు అంగరంగా వైభవంగా జరుగుతాయి.

**అట్టహాసంగా పోటీలు...**

వరంగల్‌క్రారోడ్‌లోని మారుతీనగర్‌లో ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్నాయి. అలాగే ఏదులాపురం గ్రామంలో 13వ తేదీ రాత్రి ఆరు గంటలకు పోటీలు జరపనున్నారు. అంతేకాకుండా డిఎస్ ఫిల్లింగ్ స్టేషన్, ఆదిత్య నగర్‌లో సైతం పోటీలు జరుగుతాయి. వీటిని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించనున్నారు. సమయం మేరకు పోటీలు ముగిసిన అనంతరం న్యాయ నిర్ణయతలు ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గులను, కన్సలేషన్‌కు ఎంపికైన వారిని సెలెక్ట్ చేస్తారు. అటు తర్వాత ఓ ప్రత్యేక రోజును ఏర్పాటు చేసుకుని బహుమతులను ప్రధానోత్సవం చేయడం అనవాయతీ.

# పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-సిపిఐ శత వసంతాల ఉత్సవాలు విజయవంతం**
**సహకరించిన అందరికీ కృతజ్ఞతలు**



**ప్రజాపక్షం/మణుగూరు:** సిపిఐ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, సిపిఐ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని దీనిని ఎవరు మర్చిపోకూడదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య అన్నారు. గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల కార్యదర్శులు మరియు మణుగూరు మండల పట్టణ, కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఈ సమావేశానికి రాయల బిక్షం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా పార్టీ పేద ప్రజల పక్షపాతి అని, కార్మిక , కర్షక, అణగారిన వర్గాల కోసం నిరంతరం పాటుపడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం నిరంతరం వారితో ఉంటూ వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ (ఎర్ర జెండా) శతవసంత ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరపడం మామూలు విషయం కాదని, అధికారం లేకుంటే కనుమరుగైపోతున్న అనేక పార్టీలు ఇవాళ మనం కళ్ళకు కట్టినట్లు చూస్తున్నామని, ఈ దేశంలో ఇంకా అధికారంలో లేకున్నా 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, నిజాం నవాబును ఎదురించి దొరల గడీలను బద్దలు కొట్టి, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి వేలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు. సిపిఐ పార్టీ ని పినపాక నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని, కొంతమంది కేవలం ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి తొత్తులుగా పనిచేస్తున్నారని ఇది సరైన విధానం కాదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, బూర్గంపాడు మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు (లడ్డా), పినపాక మండల కార్యదర్శి పద్మనాభ రాజు, జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాస్, గడ్డం మనోహరా చారి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్ మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల బిక్షం, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, జక్కుల రాజబాబు, కన్నెబోయిన ప్రసాద్, వజ్జ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో సంక్రాంతి సందడి

**-ఆటా, పాటలతో ముందస్తు సంక్రాంతి వేడుకలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం సంకాంత్రి సంబురాలు నిర్వహించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం, గురుకుల పాఠశాల లో సంక్రాంతి ముందే వచ్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటా, పాటలతో సందడి చేశారు. బోగి ను పురష్కరించుకుని విద్యార్థులకు బోగి పండ్లు పోసి దీవించారు. సంక్రాంత్రి పర్వదినం ముగ్గులు వేసి, పొంగళ్లు చేసి, కనుమ రోజున పాడి పశువులకు పూజలు చేసిన తరహాలోనే సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడారు. సంక్రాంతి యెక్క విశిష్టత ను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాసుందరీ, సిబ్బంది, పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వేళ పహారా ముమ్మరం

**-ఊరికి వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి**
**-నగదు, ఆభరణాలు భద్రం**
**-నగర వాసులకు సిపి సూచన**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సంక్రాంతి పండుగకు చాలా వరకు ప్రజలు తమ తమ స్వగ్రామలకు వెళ్తారని అటువంటి సమయంలో తాళం వేసిన ఇళ్లను దుండుగులు రెక్కి వేసి చోరీలకు పాల్పడుతారని దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నగరంలో రాత్రివేళ పోలీసు పహారా ముమ్మరం చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. ఊరు వదిలి వెళ్లేవారు విలువైన అభరణాలు, నగదు ఇంటి వద్ద ఉంచకుండా వెంటతీసుకుని వెళ్లాలని లేదా బ్యాంకులో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈమేరకు గురువారం ఆయన ఊరు విడిచి వెళేవారికి పలు సూచనలు చేశారు. ఊరికి వెళ్లే కుటుంబాల వారు ఇంటికి తాళం వేసినప్పుడు కనిపించకుండా పరద అడ్డు ఉంచాలన్నారు. చుట్టుపక్కల వారికి, సమీప పోలీసు స్టేషన్‌లో ఊరు వెళ్తున్న విషయాన్ని తెలియపరచాలన్నారు. ఇంటి ఆవరణలో సిసి కెమోరాలు ఉన్నవారు తరచూ సెల్ ఫోన్‌లో గమనిస్తూ ఉండాలన్నారు. ఇతరులకు అనుమానం రాకుండా ఇంట్లో ఒక గదిలో లైటు వేసి ఉంచలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. నివాసముంటున్న ప్రాంతానికి చెందిన పోలీసు స్టేషన్ నెంబర్ వెంట ఉంచుకోవాలన్నారు. ఇంట్లో ఉండే మహిళలు, వృద్దుల వద్దకు గుర్తుతెలియని వారు సమాచారం కోసం వస్తే వారిని నమ్మవద్దన్నారు. దొంగతనాలు నివారించేందుకు రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచుతున్నట్లు తెలిపారు. ముందుగా సమాచారం ఇచ్చిన వారి నివాస ప్రాంతాల్లో పోలీసు గస్తి పెంచడమే కాకుండా సదరు ఇళ్లపై శ్రద్ధ చూపుతామన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ఆటోల అడ్డాలను తనిఖీలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించామని ఆయన పేర్కొన్నారు.

# గంజాయి మత్తుకు బానిసవుతున్న యువకులు





**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** చదువుకునే విద్యార్థులు, మైనారిటీ తీరని పిల్లలు గంజాయిని సేవిస్తూ ఇంట్లో తల్లిదండ్రులను బయట ఇతరులను లెక్క చేయకుండా ఇస్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా మైనారిటీ తీరని పిల్లలకూ లక్షలు విలువచేసే టూ వీలర్ మోటార్ వెహికల్స్ ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలను వారే బలి చేసుకునే అవకాశం తల్లిదండ్రులే కల్పిస్తున్నారు. పిల్లలపై పర్యవేక్షణ కలిగి ఉండాల్సిన తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించకపోవడం అనర్థాలకు దారి తీస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మణుగూరు మండలంలో పిల్లలు పద్దెనిమిది సంవత్సరాల లోబడి, పైబడి పిల్లలు ఇంట్లో నుండి వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు గమనించాలి. పట్టణానికి దూరంలో స్మశాన వాటికల్లో, గ్రామ శివారు ప్రాంతాల్లో, వాగులల్లో వంకలల్లో, చెరువులు, అటవీ ప్రాంతాల్లో, రాత్రి వేళలో రేగుల గండి, పైలెట్ కాలనీ, పాత మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్, శివలింగాపురం, పీవీ కాలనీ ఆంజనేయ స్వామి టెంపుల్, సింగరేణి ఏరియా ఆసుపత్రి, పలు ఏరియాలో గంజాయి త్రాగి ఒంటరిగా తిరుగుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల మీరే జాగ్రత్త వహించాలి. మణుగూరులో ప్రస్తుతం గంజాయి అలవాటు పడుతున్న యువకులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. ఇంట్లో ఉన్న ప్రతి పిల్లవాడిని, ఎటు వెళ్తున్నాడో, ఎక్కడికి వెళ్తున్నాడో తల్లిదండ్రులు గమనించాల్సిందే, వారిని ఎప్పటికప్పుడు ప్రశ్నించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే, ఒకవేళ వినకపోతే మారాం చేసిన పిల్లల గురించి పోలీసులకు సమాచారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. తద్వారానైనా పిల్లలు బాధ్యతగా, సత్ప్రవర్తనతో మెదులుతారని పలువురు భావిస్తున్నారు.

# ఘనంగా తొగ్గూడెం సిపిఐ గ్రామ శాఖ మహాసభ



**ప్రజాపక్షం/పాల్వంచ:** తొగ్గూడెం సిపిఐ గ్రామ శాఖ మహాసభ జర్పల మోహన్, నాంచారి రాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈమహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. అనంతరం నూతన కమిటీనిని ఏర్పాటు చేశారు. సిపిఐ శాఖ కార్యదర్శి బాదావత్ శ్రీను, సహాయ కార్యదర్శిగా జర్పుల కిషన్, ట్రెజరర్ భూక్య నరేష్, రైతు సంఘం అధ్యక్షులుగా జర్పుల బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు భాస్కర్, కార్మిక సంగం అధ్యక్షులుగా వాంకుడోత్ సురేష్, టక్రి సురేష్, యువజన సంఘం ఏఐవైఎఫ్ కార్యదర్శిగా జర్పుల హనుమంత్‌కుమార్, అధ్యక్షులు గుగులోత్ సాయిరాం, కార్యదర్శులుగా అంత మంగల, మొదిలి సుభాష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా చిట్టి, కార్యదర్శిగా లక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదావత్ శాంతి, బానోత్ బిక్షం, బానోత్ వీరన్న, వాసు, నాగేశ్వరరావు, మోహన్, జర్పుల బాలు, సక్కు, రామ, లింగ, రమణ తేజ, ఈశ్వర్, సుధీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోడు భూముల సమస్యపై ఎమ్మెల్యే పాయంకు వినతి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం మోతే గ్రామానికి చెందిన వ్యవసాయ రైతులు పోడి భూమి సమస్యపై పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మర్యాద పూర్వకంగా కలిసి వారి సమస్యను విన్నపించారు. గత 35 సంవత్సరాల నుండి 40 కుటుంబాలు కలిసి సాగు చేస్తున్న వ్యవసాయ భూమి రెండు పంటలు పండుతుందని ఈ భూమిలో కరెంటు సౌకర్యం మరియు బోరులు ఉన్నాయని ఈ భూమి ఫారెస్ట్ భూమి అంటూ గత కొంత కాలం నుండి బీట్ ఆఫీసర్స్ ఇబ్బందికి గురి చేస్తున్నారని మాపై దయవుంచి ఫారెస్ట్ ఆఫీసర్లు మా జోలికి రాకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ఫారెస్ట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మీకు ఎటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయంకి మోతే రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి శ్రీవారి సేవలో యువకుల ఉత్సాహం



**ప్రజాపక్షం/కామేపల్లి:** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి సేవా కార్యక్రమంలో కామేపల్లి, కారేపల్లి మండలాలకు చెందిన యువకులు ఎంతో ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుసుమ నాగరాజు టీం లీడర్ ఆధ్వర్యంలో 10 మంది యువకులు వారం రోజుల పాటు తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న వయసులో భక్తి భావం నెలకొనడంతో మండల ప్రజలు అభినందిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెల్లబోయిన రాము, నల్లమోతు రంగారావు, కిరణ్‌నాయక్, సతీష్‌కుమార్, పోట్లకాయల హుస్సేన్(బాలాజీ), కుసుమ, శ్రీనివాస్, శ్రావణ్, లక్ష్మ్మ, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి రాములుకి నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా తొలి ఎంపిటిసి గుగులోత్ రాములు(75) మృతి చెందారు. కాగ గురువారం భాగ్యనగర్ తండా కాంగ్రెస్ నాయకులు మృతుడు రాములు భౌతికాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదవి కాలంలో గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసారని గుర్తు చేశారు. చివరి వరకు నమ్ముకున్న తెలుగుదేశం పార్టీలోనే కొనసాగిన నిజమైన తెలుగుదేశం నాయకునిగా చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సొసైటీ డైరెక్టర్ బానోత్ హిరలాల్, మాజీ ఎంపిటిసి బానోత్ రాంచందర్, సీనియర్ నాయకులు బానోత్ రాందాస్, గుగులోత్ భగవాన్ దాస్, భూక్యా సక్రియ, కాంటెస్టెడ్ సర్పంచ్ బానోత్ లీలావతి, మైనారిటీ సెల్ నాయకులు షేక్ గౌస్ పాషా, వాంకుడోత్ గాంధీ, జీవనలాల్, యువసేన నాయకులు అజ్మీరా వీరన్న, రాములు కుమారులు, కుటుంబ సభ్యులు, దంజిలాల్, హిరలాల్, కిరణ్‌కుమార్, వసంత్, సోదరులు కొట్య, సామ్య, సకృ తదితరులు పాల్గొన్నారు.

## టీ స్టాల్ ప్రారంభం





**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి సింగరేణి మండలం నందు ఐకెపి ద్వారా ఇంద్ర మహిళ శక్తి పథకం ద్వారా ఎంపీడీవో ఆఫీస్ నందు టీ స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్ పాల్గొని, టీ స్టాల్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళల అభ్యున్నతి కోసం వారు సొంతంగా వ్యాపారం చేసే స్త్రీ గౌరవాన్ని పెంచే విధంగా వాళ్ళను ప్రోత్సహిస్తూ అనేక ప్రోత్సాహాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కారేపల్లి మండలంలోని ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా టీ స్టాల్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఇంకా ఇలాంటి ప్రోత్సాహాలను మహిళలకు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందన్నారు. తద్వారా మహిళలు వ్యాపార సంఘంలో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా గుర్తింపు



**ప్రజాపక్షం/పాల్వంచ:** స్థానిక పాల్వంచలో గల కేఎల్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్ అటానమస్ హోదా గుర్తింపును రాబోయే ఐదు విద్యా సంవత్సరాలకు ప్రధానం చేసినట్లుగా ఛైర్ పర్సన్ కాటిరెడ్డి నాగమణి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటానమస్ హోదా, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ పొందిన ఏకైక విద్యా సంస్థ అని తెలిపారు. బహుళ జాతి కంపెనీలతో ఉద్యోగావకాశాలు పొందటానికి, దానికి అనుకూలమైన సిలబస్‌ను బోధించడానికి, ఈ అటానమస్ హోదా ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ గుర్తింపు కేఎల్ఆర్ విద్యా సంస్థలకు ఒక మైలు రాయి అని, విద్యా దాత స్వర్గీయ డాక్టర్ కే లక్ష్మారెడ్డికి నిజమైన నివాళి అని ఆయన కుమారుడు డైరెక్టర్ కె సిద్ధార్థరెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు పొందడంలో అధ్యాపక బృందం కృషిని కొనియాడుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ డాక్టర్ కె రాజేంద్ర ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కందాళ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి 65వ జన్మదిన వేడుకలను తిరుమలాయపాలెం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు భాష బోయిన వీరన్న కందాళ ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి కందాళ ఉపేందర్ రెడ్డి అభిమానులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడి చేరుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షుడు భాష బోయిన వీరన్న మాట్లాడుతూ పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి జననేత అని పాలేరు నియోజకవర్గ ప్రజల ప్రతి ఒక్కరి గుండెల్లో ఆయన స్థానం స్థిరంగా ఉందని అన్నారు. ఆ భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తన కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని, కోరుకుంటూ రానున్న రోజుల్లో ప్రజల కోసం మంచి ఉన్నత స్థానాన్ని స్వీకరించి ప్రజా సేవ చేయాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలస్యం నాగేశ్వరావు, బోడ మంచ నాయక్, చామకూరి రాజు, బానోత్ రవి ఆర్మీ,పరికపల్లి చంద్రశేఖర్, ఎస్కే.చాందు, ధరావత్ శంకర్, బానోత్ మోహన్, ధరావత్ నరేష్, పోలేపొంగు రామచంద్రు, వెంకటేశ్వర్లు, వనవాసం వెంకటరెడ్డి, వశపొంగు వెంకన్న, దేవరం దేవేందర్ రెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, పోలేపొంగు వెంకటేశ్వర్లు, కొప్పుల శ్రీనివాస్, వీరబాబు, గుజ్జ రామకృష్ణ, గంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీధర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కమిటి ఆధ్వర్యంలో జన్మదిన కేక్ ను కట్ చేసి వేడుకలు చేశారు: స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడారు. నిరంతరం ప్రజా సేవ కోసం పాటుపడే శ్రీధర్రెడ్డి పుట్టిన రోడు వేడుకలు నూరేళ్లు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, షేక్ షర్ఫుద్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్ష, గెల్లా సాయి, బాజా రామకృష్ణ. ఎలిగేటి నరసింహారావు, మన్నె రాధాకృష్ణ. కందరబోయిన గోపి, మారేపల్లి వెంకటేశ్వర్లు, తంగెళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కందాళ జన్మదినం సందర్భంగా రాజారంలో పండగ వాతావరణం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి 65వ జన్మదిన వేడుకలను రాజారం గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొప్పుల మధుసూదన్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షుడు రంగాపురం బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సెంటర్లో మొదట కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన

## గ్రామం మొత్తం స్వీట్లు పంపిణీ చేసిన మధుసూదన్ రెడ్డి

అనంతరం కొప్పుల మధుసూదన్ రెడ్డి సొంత ఖర్చులతో గ్రామం మొత్తం స్వీటీ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్రెడ్డి ప్రతి ఒక్కరి గుండెల్లో కొలువై ఉన్నాడని ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కందాళ ఉపేందర్ రెడ్డి మంచి స్థాయికి చేరుకొని ప్రజలకు సేవ చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేల్పుల మల్లయ్య, పేర్ల మల్లయ్య, గుండాల మల్లయ్య, గణేష్, మందుల ఎల్లయ్య సామ వెంకటరెడ్డి, లింగారెడ్డి, సురేందర్ రెడ్డి, మల్సూర్ రెడ్డి, చిన్న రాంరెడ్డి, పేర్ల సంపత్, తిరుమల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నుగ సురేందర్ రెడ్డి, కందాల సురేందర్ రెడ్డి, జంపాల రమేష్, రంగాపురం రవి గౌడ్, సామ శివ సాయి రెడ్డి, ధరావత్ శంకర్, గ్రామ పెద్దలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నిబద్ధతగల కమ్యూనిస్టు చేబ్రోలు లాలయ్య



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేబ్రోలు లాలయ్య నిబ్బద్ధత గల కమ్యునిస్టు అని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు అన్నారు. బుధవారం రాత్రి అనారోగ్యంతో లాలయ్య మృతిచెందడంతో ఆయన మరణవార్త తెలుసుకున్న కొండపర్తి ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి వెళ్లి లాలయ్య మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ లాలయ్య బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు. ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి లాలయ్య పాత్ర ఎనలేనిదన్నారు.లాలయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు,ఎర్రా బాబు,శివరామకృష్ణ, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇటికల రామకృష్ణ, గ్రామశాఖ కార్యదర్శి తాళ్లపల్లి అజయ్,పుల్లా సాహెబ్,ఇంద్రసేనా,బారాసా మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య,కాంగ్రెస్ నాయకలు కూరపాటి కిషోర్,మడుపల్లి భాస్కర్ ఉన్నారు.

# ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/వైరాః** రోడ్డు ప్రమాదాల పట్ల వాహనదారులకు జాగ్రత్తగా అవసరం ట్రైనీ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రవిచంద్ర అన్నారు. వైరా మోటార్ వెహికిల్ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా మాసోత్సవాల సందర్భంగా రవిచందర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ఎంతో ముఖ్యమని, ప్రమాదాలు జరిగినప్పుడు మన ప్రాణాలను హెల్మెట్ కాపాడుతుందని అన్నారు. అదేవిధంగా సీటు బెల్టు కూడా ధరించాలని, సీటు బెల్టు ధరిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు క్రింద పడిపోకుండా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దు కుటుంబ సభ్యులను దూరం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటాక్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని నిరంతరం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తహాసిల్దార్ పి.వి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్ కే.సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ అన్నారు. సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వసుంధర సిబ్బందితో కలిసి బీరోలు సబ్ సెంటర్ లో సమావేశం నిర్వహించారు.

## మండలంలో పలు ఆరోగ్య సబ్ సెంటర్‌లు పరిశీలన

మొదట సబ్ సెంటర్ ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని అనంతరం ఓపి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిరంతరం గ్రామాలలో వ్యాధులను ముందే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని, ప్రజలను ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్ వారంలో వచ్చిన భారీ వరదలకు తిరుమలాయపాలెం మండలంలో వైద్య సిబ్బంది ఎంతో ఉత్తమ వైద్య సేవలు అందించారని అభినందించారు. అనంతరం పలు గ్రామాల్లో సబ్ సెంటర్ లను పల్లె దావకానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది రెవెన్యూ ఇన్స్పెక్టర్ వీరయ్య పాల్గొన్నారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** సంక్రాంతి పర్వదిన సందర్భంగా ఖమ్మం కోర్టు ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి ఉమారాణి, రెండవ బహుమతి కె. పావని, మూడవ బహుమతి స్వర్ణకుమారి, ఆశా లు సాధించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె. ఉమాదేవి, అపర్ణ, అర్చనకుమారి, దీప, మాధవి, ఆర్. శాంతిలత, శివరంజని, శీనయ్య, కల్పన, కెవి చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# భూక్యా వీరభద్రంను అభినందించిన తాండ్ర పెద్దబ్రహ్మం



**ప్రజాపక్షం/వైరాః** ఇంటింటి సిపిఎం కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ సిపిఎం సీనియర్ నాయకులు, వైరా మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తాండ్రపెద్ద బ్రహ్మం, సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రంకు స్వీటు తినిపించి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంటింటి సిపిఎం కార్యక్రమంలో భాగంగా తాండ్ర పెద్ద బ్రహ్మం, అనసూర్యమ్మ దంపతులు వెయ్యి రూపాయలు విరాళం అందజేసి పార్టీ అభివృద్ధిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్ రావు, భూక్యా విజయ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ పేర్‌లో ప్రణీత్ ప్రతిభ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** జగన్నాధపురం జడ్‌పి పాఠశాల విద్యార్థి ఇనుకుర్తి ప్రణీత్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంను సాధించి ప్రతిభను చాటారు. ఈ విద్యార్థిని తెలంగాణ రాష్ట్రము నుండి జాతీయ స్థాయిలో సౌత్ ఇండియా లెవల్ జరుగు సైన్స్ ఫెర్‌లో స్థానంను కల్పించారు. రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల నుండి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెర్ జనవరి 7,8,9తేదీలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల నుండి 517 స్టాల్స్ ఏర్పాటు చేయగా నేచురల్ ఫామింగ్(సేంద్రియ పద్ధతిలో అగ్రికల్చర్ సాగు) విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతలుగా ఇనుకుర్తి ప్రణీత్ నిలిచారు. తను తయారు చేసిన విభాగం ద్వారా ప్రజలకి సేంద్రియ పద్ధతిలో సాగు విధానం దాని వలన కలుగు లాభాలు, ఆరోగ్యం మేలు ఎలా ఉంటుందో తెలియ చేసి అందరిని ఆశ్చర్య పర్చి తన ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల అన్నపురెడ్డిపల్లిలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెర్‌లో ఇదే విద్యార్థి ప్రణీత్ జిల్లాలో మొదటి స్థానములో నిలవగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట నర్సమ్మ, ఉపాధ్యాయ బృందం సహకారంతో గైడ్ టీచర్‌గా మందారి సారలమ్మ, విద్యార్థుకి గైడ్‌గా వ్యవహరించి నేడు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రణీత్ మొదటి స్థానంలో నిలిచి మరో సారి ప్రతిభను నిలబెట్టుకున్నాడు. గురువారం జడ్చర్లలో జరిగిన సైన్స్ ఫెర్ ముగింపులో ప్రతిభ కనపర్చిన విద్యార్థి ప్రణీత్‌కు, పాఠశాల గైడ్ టీచర్ మందారి సాలరమ్మకు జడ్చర్ల ఎంఎల్‌ఏ జనంపల్లి అనిరుథ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందించి ప్రశంచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నర్సమ్మ పాఠశాల ఉపాధ్యాయులు గైడ్ టీచర్ మందారి సారలమ్మకు విద్యార్థి ప్రణీత్‌కు పాఠశాల స్టాఫ్‌కు అభినందనలు తెలిపారు.

# రామాలయంలో అన్నదానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఐదవ డివిజన్ బాలాజీ నగర్‌లో గల రామాలయంలో వాసిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రామాలయంలో జరిగిన కార్యక్రమంలో సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయానికి 100 ప్లేట్లు, గ్లాసులను వితరణగా ఇచ్చారు. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ యల్లంపల్లి హన్మంతరావు, కమిటీ సభ్యులు గద్దె వెంకయ్య, జ్యోతి, సుహాసిని, సేవా సమితి సభ్యులు వాసిరెడ్డి సుబ్బారావు రామసీత దంపతులు, వీరభద్రరావు, చక్రధర్‌రావు, ధనలక్ష్మి , రాధాకృష్ణ, శ్రీదేవి, అర్జున్‌రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా అభివృద్ధి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్‌వే, జాఫర్ బావి అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్‌బావి పునరుద్ధరణతో పాటు పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లాపైకి వెళ్లి సందర్శించేవిధంగా రోప్‌వే ఏర్పాటుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖిల్లా మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి ఖిల్లాపైకి వెళ్లి క్షేత్రస్థాయిలోలో పరిశీలించారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు అనువుగా ఉండే మార్గం, ఎక్విప్‌మెంట్ ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాట్లపై పరిసరాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాఫర్ బావి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిల్లాపై పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేవిధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రుల ఆదేశాల మేరకు ప్రజలకు అనుకూలంగా, ఖిల్లాకు పూర్వ వైభవం తీసుకు వచ్చేలా తీర్చిదిద్దుతున్నామన్నారు.



సందర్శకులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకుండా ఖిల్లాకు వచ్చేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రత్యేక హంగులతో లైటింగ్, అనువైన పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పోరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్జిత్‌సింగ్ దలైవాల్‌కు మద్దతుగా సంఘీభావం





**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**

**ప్రజాపక్షం/వైరా:** రైతులు పండించిన పంటలకు చట్టబద్దమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ పంజాబ్, హర్యానా సరిహద్దులో ఖనేరీలో 46 రోజుల నుంచి నిరవధిక నిరహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జిత్‌సింగ్ దలైవాల్‌కు మద్దతుగా జిల్లావ్యాప్తంగా గురు, శుక్ర వారాల్లో సంఘీభావంగా రైతులు ప్రదర్శన, దీక్షలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం వైరా మున్సిపాలిటీ పరిధిలో గండగపాడులో రైతు నేత జగ్జిత్‌సింగ్ దలైవాల్ ప్రాణాలు కాపాడాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మూలంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. గత ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా నల్లచట్టాలను రద్దు చేసి చట్టపరమైన గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికి అలు చేయలేదు అన్నారు. మరోవైపు నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం అమలు చేయాలని ప్రయత్నం చేయడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు నేత జగ్జిత్‌సింగ్ దలైవాల్ ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, గ్రామ కార్యదర్శి కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, మచ్చా మణి, మల్లెంపాటి వీరభద్రం, కొంగర సుధాకర్, పల్లెబోయిన వెంకటేశ్వరరావు, కిన్నెర మోతి తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/కొత్తగూడెం:** పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామపంచాయతీలతో కార్పొరేషన్ ఏర్పాటులో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషిని ప్రతిఒక్కరూ అభినందించాల్సిందేనని, కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధిలో తడబడుతున్న కొత్తగూడెం ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని యునైటెడ్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పల్లబోతు సాయి అన్నారు. పట్టణంలోని పెద్ద బజారులో మర్చంట్ అసోసియేషన్, ఏఐటియుసి అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కూనంనేని సాంబశివరావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు కొత్తూగూడెం ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు ఊహించని కానుకని, అభివృద్ధి కాముకుడు కూనంనేని ముందుగాని ఆలోచించి కార్పొరేషన్ సాధించిపెట్టాడని తెలిపారు. అనతికాలంలో కొత్తగూడెం ప్రాంతం నగరాలకు ధీటుగా అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో విమానాశ్రయం, హరిత హోటల్ అందుబాటులోకి రానున్నాయని, ఇది



మరింత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చారుగుండ్ల మురళి, ప్రేమ్‌కుమార్, కాండేల్వాల్, దామోదర్‌దాస్, అత సీనియా, మనీష్ అగ్రవాల్, పల్లపోతు శ్రీనివాస్, కాపుగంటి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు , మొగలి తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురం మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు, బిజీ కొత్తూరు, మొండికుంట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటన విస్తృతంగా జరిగింది. ముందుగా తుమ్మలచెరువును బోటింగ్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలచెరువులో పర్యటన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పర్యటకులు సేద తీరటానికి కావలసిన ప్రతి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని, ఏజెన్సీ ప్రాంతాల్లోని తుమ్మలచెరువుని పెద్ద పర్యటన ప్రాంతంగా చేయడమే కాకుండా ఏజెన్సీలో వనరులను గిరిజనులు ఉపయోగించుకునే విధంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం



రామచంద్రపురంలోని రోడ్డు ప్రమాదంలో మరణించిన శంకర్‌రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బిజీ కొత్తూరులోని అనారోగ్యంతో మరణించిన పగడాల ప్రమీల వారి కుటుంబాన్ని పరామర్శించారు. మొండికుంట మర్లమడుగులోని పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, నెల్లిపాక పిఏసిఎస్ ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి రమేష్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల్, మున్షిని కలిసిన తుమ్మల యుగంధర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఏఐసిసి జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షిని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లో కెసి వేణుగోపాల్, దీపాదాస్ మున్షిలను తుమ్మల యుగంధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మంజిల్లాకు సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు.



# పదిలో ఉత్తమ ఫలితాలు సాధనపై సమీక్ష

**ప్రజాపక్షం/కల్లూరు:** మార్చిలో జరిగే 10వ తరగతి పరీక్షలకు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని 9 వసతి గృహాలలో 175 మంది పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నారని వారిని ఏబిసిడి గ్రూపులుగా ఏర్పాటు చేసి సమీక్ష చేస్తున్నామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను సమీక్ష చేసి విద్యలో ఫలితాల్లో ముందుండే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డివిజనల్ అధికారి ఎం ఈదయ తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక శ్రద్ధతో వారిని చదివిస్తూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వసతి గృహాల్లో పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతిరోజు సమాచారం తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నూతనంగా కామన్ మెనూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూని అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, అడసర్లపాడు, కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలాల పరిధిలోని వసతి గృహాల సంక్షేమ అధికారులు రవీంద్ర, శ్రీనివాసరావు, విష్ణు, హేమలత, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రాగమయి గురువారం లబ్ధిదారులకు అందజేశారు. 17 మంది లబ్ధిదారులు 5.40 లక్షలు నగదు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం రూ. ఐదు లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ త్వరలో కల్లూరు మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తున్నామని, దానిలో పుల్లయ్య బంజర గ్రామాన్ని విలీనం చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, గృహలక్ష్మి , మహాలక్ష్మి , రైతు భరోసా, రుణమాఫీ ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తూ ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని ఆమె ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎసిడిపిఓ రత్తమ్మ, అంగన్‌వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



# వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీ దేవిపల్లి మండలంలోని మైలారం గ్రామం నందు గురువారం వాలీబాల్ పోటీలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈస ందర్భంగా ఆయన మాట్డాతూ క్రీడలు స్నేహపూర్వక సంబంధాలను పెంపొందిస్తాయని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దీటి లక్ష్మీపతి, సొసైటీ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి దారా శ్రీనివాస్, జలీల్‌పాషా, రాజబాబు, బైకాని, కృష్ణ, పారిపర్తి రాజు,మారినేని మాధవరావు, నరేష్,లాలు, గోపాల్ పాల్గొన్నారు.



# కార్మిక పక్షపాతి రాజేశ్వరరావు

**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** మైనింగ్ రంగంలో అపారమైన అనుభవం, కార్మిక సంక్షేమం పట్ల అంకితభావం కలిగి సమిష్టి కృషి ద్వారా నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు గడువు కంటే ముందే సాధించడంలో గని మేనేజర్ గా బి.రాజేశ్వర రావు పాత్ర మరువలేనిదని ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు ఓ. సి నుంచి బదిలీ పై కొత్తగూడెం జె. వి ఆర్ ఓ. సి కి వెళుతున్న రాజేశ్వర రావు ను గని టి బి జి కె యస్ నాయకులు మురళీ కృష్ణ, కటారి ప్రసాద్, నాయుడు సతీష్, లెక్కల శంకరయ్య, బీరయ్య, రమేష్ లు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ దిశ నిర్దేశం, గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసచారి తోడ్పాటు ద్వారా మణుగూరు ఒపెన్ కాస్ట్ ను మోడల్ మైన్ గా నిలిపేందుకు అయన కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్, బంగారి పవన్ కుమార్, మురళీ కృష్ణ, బంగారి కటారీ ప్రసాద్, నాయుడు సతీష్, లెక్కల శంకరయ్య, బీరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

